యూరియాతో ముప్పే

- పశుగ్రాసం పెంపకంలో అతిగా వినియోగం
- ఆ గ్రాసం తిన్న పాడి గేదెల్లో కాల్షియం లోపం
- తగ్గుతున్న పాల నాణ్యత


పాలు పితుకుతున్న మహిళా పాడి రైతు


సాగు చేసిన పశుగ్రాసం

నంద్యాల(అర్బన్): పశుగ్రాసం ఏపుగా పెరగడం కోసం పాడి రైతులు యూరియాను అతిగా వినియోగిస్తున్నారు. అలాంటి మేత తిన్న పాడి గేదెలు, ఆవుల్లో క్యాల్షియం లోపిస్తోంది. తద్వారా పాల నాణ్యత తగ్గి.. ధరలూ పడిపోతున్నాయి. పశువులకు మేతగా వినియోగించే దాణా, పిండి పదార్థాలు గల చెక్క, తవుడు, ఆల్ మిక్స్, గోధుమ పొట్టు తదితరాల ధరలు బాగా పెరగడం వల్ల రైతులు పశు గ్రాసంపై ఆధార పడాల్సి వస్తోంది. గ్రాసం పెరిగేందుకు మిశ్రమ ఎరువులతో పాటు సేంద్రియ పద్ధతులు పాటించాలి. కానీ వీటి వల్ల గ్రాసం త్వరగా పెరగదు. తక్కువ ధరకు లభించే యూరియా వాడితే ఏపుగా పెరుగుతుంది. దీంతో రైతులు పశుగ్రాసం సాగులో ఇష్టానుసారంగా యూరియా వాడుతున్నారు.

పాల నాణ్యతపై ప్రభావం

నంద్యాల నియోజకవర్గంలో 31 వేల పశువులు ఉన్నాయి. 18 వేల మంది వరకు పాడి రైతులు ఉన్నారు. రోజుకు 20 నుంచి 30 వేల లీటర్ల వరకు పాల ఉత్పత్తి జరుగుతోంది. అయితే యూరియా ఎరువుతో పండిన పశుగ్రాసాన్ని తిన్న పాడి పశువుల్లో క్యాల్షియం లోపం కనిపిస్తోంది. ముఖ్యంగా పాల ధర తగ్గడానికి ఇది కారణమవుతోంది. ఈ కారణంగా పాలలో పోషక విలువలు సాధారణం శాతం కంటే తక్కువకు పడిపోయింది. పాల ధరల్లో లీటరుకు రూ.5 నుంచి రూ.8 వరకు వ్యత్యాసం వస్తోంది. ప్రస్తుతం గేదె పాలకు క్వాలిటీని బట్టి లీటరు ధర రూ.69 నుంచి రూ.70 వరకు పలుకుతోంది.

అవగాహన లేక అనర్థాలు



కొందరు రైతులు అవగాహన లేక తక్కువ ధరకే దొరుకుతుందని యూరియాను విపరీతంగా వాడుతున్నారు. దీని వల్ల గేదె, ఆవు పాలల్లో తగిన నాణ్యత రావడం లేదు. ఈ పాలను తాగితే భవిష్యత్‌లో ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. రైతులు 5, 10 బస్తాల యూరియాను గ్రాసం పెంపకంలో వినియోగిస్తున్నారు. వాటిని తిన్న పశువులు, ఆ పాలు తాగిన వారి పరిస్థితి భవిష్యత్‌లో ఇబ్బందికరంగానే ఉంటుంది. –రాజశేఖర్, ఏడీఏ, నంద్యాల

సేంద్రియ ఎరువులు వాడాలి



ఇటీవల యూరియా వాడకం విపరీతంగా పెరిగిపోయింది. దీంతో యూరియా కొరత ఏర్పడుతోంది. యూరియాతో మొక్క ఏపుగా పెరగడం తప్ప ఇతర ప్రయోజనాలు ఏవీ ఉండవు. అతిగా వాడడం వల్ల భూమి కలుషితమై పనికి రాకుండా పోతుంది. భూసార పరీక్షలు చేయించి, ఏ మోతాదులో ఏ ఎరువు వాడాలో తెలుసుకొని వాడాలని చెబుతూనే ఉన్నాం. రైతులు సేంద్రియ ఎరువులు వాడితే చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. –ప్రసాదరావు, ఏఓ, నంద్యాల

క్లుప్తంగా

క్షయ వ్యాధి గుర్తింపు పరీక్షలు


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి మురళీకృష్ణ

శిరివెళ్ల: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో గురువారం నుంచి క్షయ వ్యాధి గుర్తింపు కార్యక్రమం ప్రారంభమయ్యింది. వైద్యాధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ వైద్య శాల పరిధిలో 30 మంది వ్యాధిగ్రస్తులు చికిత్స పొందుతున్నారన్నారు. వారి కుటుంబ సభ్యులకు వ్యాధి సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కుటుంబ సభ్యులకు పరీక్షలు చేస్తున్నామన్నారు. టీబీ కేసులను త్వరగా గుర్తింపు, వ్యాధి ద్వారా సంక్రమించే మరణాలను తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రాంమోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు సరస్వతి, రవికుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

10న జాబ్ మేళా


పోస్టర్లు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 10వ తేదీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ తెలిపారు. గురువారం కళాశాలలో జాబ్‌మేళా వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జాబ్ ఫెస్ట్–2025 నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జాబ్ మేళాలో 14 ప్రముఖ కంపెనీలు 500కు పైగా పోస్టుల భర్తీ కోసం పాల్గొంటున్నాయన్నారు. జిల్లాలోని నోడల్ రీసోర్స్ సెంటర్ పరిధిలో ఉన్న పాణ్యం, ఎర్రగుంట్ల, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, ఆత్మకూరు, శ్రీశైలం డిగ్రీ కళాశాలలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం 9703377803 నంబర్‌ను సంప్రదించాలన్నారు. పార్వతి, అధ్యాపకుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఊంజల్ సేవ


ఊంజల్ సేవలో పాల్గొన్న భక్తులు

నంద్యాల (వ్యవసాయం): శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని సంజీవనగర్ రామాలయంలో గురువారం సాయంత్రం సీతారామ లక్ష్మణుల ఉంజల్ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భగవత్ సేవా సమాజ్ సభ్యుల ఆధ్వర్యంలో ఉత్సవమూర్తులకు అభిషేకాలు, పట్టువస్త్రాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం ఉయ్యాలలో స్వామి అమ్మవార్లను ఆశీనులు చేసి ఉంజల్ సేవను నిర్వహించారు. మహా మంగళహారతి ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేదం పండితులు పవన్ శర్మ, సూరయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రైవేట్ విద్యాసంస్థల్లో పని చేస్తున్న అధ్యాపకులకు 12 నెలల వేతనం చెల్లించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు రఫీ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు అధ్యాపకులతో వెట్టిచాకిరి చేయించుకుంటున్నాయని తెలిపారు. శ్రమకు తగ్గ వేతనం లేక అధ్యాపకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. విద్యార్థుల వద్ద ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల జీతాలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కూడా కల్పించడం లేదన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన


మాట్లాడుతున్న సమాచార కమిషనర్

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. ఆర్‌టీఐ గురించి సిబ్బందికి, ప్రజలకు ఎలా అవగాహన కల్పించాలో వివరించారు. సమాచార హక్కు చట్టం–2005పై మున్సిపల్ సిబ్బందితో చర్చించారు. సమాచారం అడిగిన ప్రతి పౌరుడికి ఇవ్వాలని సూచించారు. ఈ సదస్సులో కమిషనర్ నిరంజన్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీకి రెండు రోజులే గడువు


వీఏఏలకు సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

రుద్రవరం: విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుకు రెండు రోజులే గడువు ఉందని, ఆ లోపు రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మురళీకృష్ణ తెలిపారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో గురువారం ఆయన వీఏఏలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ కేవలం 68 శాతం మాత్రమే అయ్యిందని తెలిపారు. ఇంకా నమోదు చేయించుకోని రైతులు ఎవరైనా ఉంటే రెండు రోజుల్లో వారు అందుబాటులో ఉన్న రైతు సేవా కేంద్రాలకు వెళ్లి విశిష్ట గుర్తింపు సంఖ్యకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రామ్మోహన్‌రెడ్డి, ఏఓ సుమతి, విస్తరణ అధికారి రాజు తదితరులు ఉన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

శిరివెళ్ల: ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరియని జిల్లా వ్యవసాధికారి మురళీకృష్ణ అన్నారు. గురువారం స్థానిక రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఏఓ సుధాకర్‌ను రిజిస్ట్రేషన్ వివరాలపై ఆరాతీశారు. మండలంలో 10,350 మంది రైతులున్నారని ఇంత వరకు 7,350 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఏఓ తెలిపారు. రైతులకు మరింత అవగాహన, ప్రచారం చేయాలని డీఏఓ ఆదేశించారు. ఏడీఏ రాంమోహన్ రెడ్డి, ఏఈఓలు పాల్గొన్నారు.

వంద శాతం పూర్తి చేయాలి

చాగలమర్రి: మండలంలో రైతు విశిష్ట సంఖ్య నమోదును వందశాతం పూర్తి చేయాలని నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి మురళీ కృష్ణ, ప్రకృతి వ్యవసాయాధికారి నరేంద్రారెడ్డి వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. గురువారం స్థానిక 3వ రైతు సేవా కేంద్రంలో ఏడీఏ రామ్మోహన్‌రెడ్డితో కలిసి ఏఓ రంగనేతాజీ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో రైతు విశిష్ట సంఖ్య నమోదు ఇప్పటికి 66% మాత్రమే నమోదు పూర్తయ్యిందని, రైతులకు అవగాహన కల్పించి రెండు రోజులలో వంద శాతం నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు.

నిరుపేద విద్యార్థినికి ఆర్థిక సహాయం


విద్యార్థినికి నగదు అందజేస్తున్న సీఐ మల్లికార్జునగుప్తా

నంద్యాల(వ్యవసాయం): డిగ్రీ చదువుతున్న నిరుపేద విద్యార్థినికి ట్రాఫిక్ సీఐ మల్లికార్జున గుప్తా గురువారం ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వాసవి జాగృతి ఇంటర్నేషనల్ క్లబ్ అనుబంధ సంస్థలు నవనంది క్లబ్ అధ్యక్షుడు కూరాకు శ్రీనివాసులు, పొట్టి శ్రీరాములు క్లబ్ నూనెపల్లి అధ్యక్షుడు తాళ్లూరు జనార్దన్‌ల ఆర్థిక సహకారంతో పేద ఆర్యవైశ్య విద్యార్థిని విద్య కోసం రూ.22 వేలు ఆర్థిక సహాయం చేయడం అభినందనీయమన్నారు. బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బింగుమల్ల శ్యామ్, వేణుగోపాల్, సుబ్బలక్ష్మయ్య, మల్లిపెద్ది నాగరాజు, బొగ్గరపు జనార్దన్, రామకృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కౌలు రైతులకు పథకాలు వర్తింపజేయాలి


మాట్లాడుతున్న హరిబాబు

నంద్యాల(న్యూటౌన్): కౌలు చట్టంలో మార్పులు చేసి కౌలు రైతులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హరిబాబు అన్నారు. గురువారం ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాలకుల విధానం వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఎన్నికల్లో రైతులను గొప్పగా మాట్లాడడం.. ఆచరణలో మాత్రం శూన్యమన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డులు ఉన్న ప్రతి రైతుకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని, సబ్సిడీ ఎరువులు, విత్తనాలు ఇవ్వాలని కోరారు. రైతు భరోసా నిధులు, పంట నష్ట పరిహారం, కౌలు రైతులకు ఇవ్వడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కౌలు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు మాట్లాడుతూ.. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు. సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోమన్న, నాయకులు నరసింహులు, శ్రీనివాసరెడ్డి, రమేష్‌రెడ్డి, ఏలియా, నాగేష్, పాములేటి, వరాలు తదితరులు పాల్గొన్నారు.

గుడిసె దగ్ధం



మహానంది: గాజులపల్లె గ్రామ సమీపంలోని ఆంజనేయస్వామి కొట్టాలలో గురువారం రాత్రి గుడిసె దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మౌలాలికి చెందిన గుడిసె పూర్తిగా కాలిపోయింది. మంటలు ఎగిసి పడటంతో మౌలాలి, కుటుంబ సభ్యులు ఇంట్లో నుంచి బయటకు పరుగులు తీశారు. బంగారు నగలు, కొంత నగదు, సామగ్రి కాలిపోయిందని బాధితులు పేర్కొన్నారు.

వన్య ప్రాణుల దాహార్తి తీర్చేందుకు చర్యలు


పెద్దవంగలి బీట్ పరిధిలోని సాసర్ పిట్‌లో నీటిని నింపుతున్న అటవీశాఖ సిబ్బంది

చాగలమర్రి: మండలంలోని డి.వనిపెంట సెక్షన్ పరిధిలోని పెద్దవంగలి, డి.వనిపెంట, ముత్యాలపాడు తండా బీట్లలో వన్య ప్రాణుల దహార్తి తీర్చేందుకు అటవీ ప్రాంతంలోని సాసర్ పిట్‌లలో ట్యాంకర్ల ద్వారా నీటిని నింపినట్లు సెక్షన్ అధికారి టి.రామకృష్ణ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో దాహార్తి తీర్చుకునేందుకు వన్య ప్రాణులు సమీపంలోని గ్రామాలలోకి, జనవాసాలలోకి రాకుండా అటవీ ప్రాంతంలో నీటి వసతి కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ అధికారులు బీఈ నగేష్, జే.శుభాష్, మదన్‌గోపాల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

నంద్యాల(వ్యవసాయం): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక ఆర్టీసీ డిపో గేటు ఎదుట రెండో రోజు గురువారం ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. యూనియన్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, నరసింహా మాట్లాడుతూ.. ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించి 138 డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గత నెల 25 తేదీ రాష్ట్ర కమిటీ నాయకులు ప్రభుత్వానికి వినతిపత్రం అందజేశారన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో నిరసన చేపట్టామన్నారు. 1/2019 సర్క్యులర్ అమలు చేయాలని, నైట్ సర్వీస్ అలవెన్స్‌ను రూ. 150 నుంచి రూ. 400లకు పెంచాలని, అక్రమ సస్పెన్షన్లు ఎత్తి వేయాలని, పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు మల్లారెడ్డి, యోగా రెడ్డి, నందీశ్వరుడు, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సంఘాల సమావేశం

నంద్యాల(అర్బన్): సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 9వ వార్షికోత్సవ నిర్వహణ, ప్రభుత్వ విధానాలు, వెనుకబడిన ప్రాంతాల భవిత తదితర అంశాలపై శుక్రవారం స్థానిక మధుమణి నర్సింగ్ హోం ఐఎంఏ హాల్‌లో ప్రజా సంఘాల సమావేశం నిర్వహిస్తున్నట్లు రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి తెలిపారు. సమావేశానికి రైతు సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగుల ఆందోళన


నిరసన తెలియజేస్తున్న బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగులు

నంద్యాల(వ్యవసాయం): సుప్రీంకోర్టు ఆదేశాలు తుంగలో తొక్కి మార్చి 25న కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన పెన్షన్ రూల్స్ ఉపసంహరించుకోవాలని కోరుతూ బీఎస్ఎన్ఎల్ విశ్రంత ఉద్యోగులు గురువారం పాత టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అసోసియేషన్ అధ్యక్షుడు రమణయ్య, అబ్దుల్ సమద్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పెన్షన్ రూల్స్‌కు తీవ్ర నష్టదాయకమైన సవరణలను లోక్‌సభలో ఆర్థిక బిల్లులో భాగంగా ప్రవేశపెట్టి దొడ్డిదారిన పాస్ చేయించుకోవడం హేయమైన చర్య అని పేర్కొన్నారు. 8వ కేంద్ర వేతన సంఘం సిఫార్సులు తమకు వర్తింపచేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రసాద్, ఓబయ్య, కామేశ్వరప్ప నాయక్, బాలకృష్ణ, భీమారావు, రంగారెడ్డి, రామయ్య, నాగరాజు, నరసింహులు, రమణ తదితరులు పాల్గొన్నారు.

సుగుణమ్మ ఆశయాలు సాధిస్తాం


నివాళులు అర్పిస్తున్న సీపీఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): భారత కమ్యూనిస్ట్ పార్టీ మహిళా ఉద్యమ నాయకురాలు సుగుణమ్మ ఆశయాలను సాధిస్తామని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, ఏపీ రైతు సంఘం కార్యదర్శి సోమన్న అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో సుగుణమ్మ ప్రథమ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్‌లో పనిచేస్తూ అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసిన ఘనత ఆమెకే దక్కిందన్నారు. ఆమె ఆశయ సాధన కోసం మహిళలు, యువత ముందుకు కదలాలని పేర్కొన్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, మహిళా సమాఖ్య కన్వీనర్ సుశీలమ్మ, ఏఐటీయూసీ నాయకులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, పుల్లయ్య, పాల్గొన్నారు.

న్యాయవాదుల ఎన్నికల షెడ్యూల్ విడుదల

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఎన్నికల నియమావళి కమిటీ సభ్యులు రామకృష్ణయ్య, తాళంకి వెంకటప్రసాద్, సుధాంసుమౌళిరెడ్డి న్యాయవాదుల ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. 2025–26 బార్ అసోసియేషన్ ఎన్నికల తేదీలను ప్రకటించారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులు, జనరల్ సెక్రటరీ, జాయింట్ సెక్రటరీ, ట్రెజరర్, లైబ్రేరియన్ సెక్రటరీ, స్పోర్ట్స్ కల్చరల్ సెక్రటరీ, మహిళా ప్రతినిధి పదవులకు ఈనెల 7వ తేదీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తామని, 8వ తేదీ అభ్యర్థుల పత్రాలు పరిశీలన, 9వ తేదీ అభ్యర్థుల విత్‌డ్రా, అదే రోజు అభ్యర్థుల తుది జాబితా ప్రకటిస్తామన్నారు. 11వ తేదీ ఉదయం 9 గంటలకు ఎన్నికలు ప్రారంభమవుతాయని, అదే రోజు కౌంటింగ్ నిర్వహించి ఫలితాలను వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో రఘుప్రకాష్, శ్రీనివాసులు, షేక్ షన్ను, తిరుపాలు పాల్గొన్నారు.

వ్యవసాయ పనిముట్ల మంజూరు

దొర్నిపాడు: మండలానికి పలు యాంత్రీకరణ వ్యవసాయ పనిముట్లు మంజూరైనట్లు మండల వ్యవసాయాధికారి ప్రమీల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాక్టర్ ఇంప్లిమెంట్స్ 23, పవర్ స్ప్రేయర్లు 13, బ్యాటరీ స్ప్రేయర్లు 7, రోటోవెటర్ 1 మంజూరయ్యాయని చెప్పారు. కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు. అలాగే ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోని వారు ఉంటే వెంటనే చేయించుకోవాలన్నారు.

అకాల వర్షం.. రైతుల టెన్షన్


గోస్పాడులో కురుస్తున్న వర్షం

గోస్పాడు: అకాల వర్షంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గురువారం సాయంత్రం మండల పరిధిలోని పలు గ్రామాల్లో వర్షం కురిసింది. ప్రజలకు ఎండ వేడి నుంచి ఉపశమనం లభించినా పంటలు దెబ్బతింటాయని రైతులు మాత్రం టెన్షన్ పడుతున్నారు. ఇప్పటికే గత నెల 22వ తేదీ కురిసిన అకాల వడగండ్ల వర్షంతో రైతులు సాగు చేసిన వరిపైర్లు, మినుము, వేరుశనగ, మిరప వంటి పంటలు దెబ్బతిన్నాయి. తిరిగి 15 రోజుల్లోపే అకాల వర్షం పడడంతో రైతులు నష్టాలు చవి చూడాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులు రబీలోనైనా తమ ఆశల పంటలను పండించుకునేందుకు ఆసక్తి చూపగా తిరిగి ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణం వారిలో ఆందోళన కలిగిస్తోంది.

నంద్యాలలో వర్షం..

నంద్యాల(అర్బన్): మండలంలోని పుసులూరు, మిట్నాల, గుంతనాల, చాపిరేవుల గ్రామాల్లో గురువారం రాత్రి అకాల వర్షం కురిసింది. ఒక్కసారిగా వర్షం కురవడంతో రైతులు కల్లాల్లో ఆరబోసిన మిర్చి, వరి, జొన్న పంటల దిగుబడులను దాచుకునేందుకు ఇక్కట్లు పడాల్సి వచ్చింది. ఆ గ్రామాలతో పాటు చాపిరేవుల, పాండరంగాపురం, కానాల తదితర గ్రామాల్లో మోస్తరు వర్షం కురవడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది.

బండలాగుడు పోటీల విజేత నంద్యాల


బండలాగుతున్న ఎద్దులు


ఎద్దుల యజమానులకు జ్ఞాపిక అందజేస్తున్న నిర్వాహకులు

గోస్పాడు: ఎద్దుల బండలాగుడు పోటీలను ప్రోత్సహించేందుకే ఏటా రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ పీపీ నాగిరెడ్డి తెలిపారు. ఉగాది పండుగను పురస్కరించుకుని గుమ్మిత మల్లికార్జునస్వామి, వీరభద్ర స్వామి తిరునాల సందర్భంగా దీబగుంట్ల గ్రామంలో రెండో రోజు గురువారం న్యూ కేటగిరి విభాగానికి సంబంధించిన ఎద్దుల పోటీలను నిర్వహించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు చిన్ననాగిరెడ్డి ప్రారంభించారు. ఈలలు, కేకలతో పోటీలు ఉత్సాహంగా సాగాయి. మొత్తం ఆరు జతల ఎద్దులు పాల్గొన్నాయి. నంద్యాల జిల్లా పెద్దకొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి కేశవరెడ్డి ఎద్దులు 20 నిమిషాలకు 3,320 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచి రూ.50వేలు బహుమతి గెలుపొందాయి. వైఎస్సార్ జిల్లా గొల్లపల్లి గ్రామానికి చెందిన వారాది రాంచరణ్, ప్రకాశం జిల్లా పొట్లపాడు గ్రామానికి చెందిన నొస్సం బైపిరెడ్డికి చెందిన ఎద్దులు 3300 అడుగులు లాగి రెండో స్థానంలో నిలిచి రూ.30వేలు సొంతం చేసుకున్నాయి. ప్రకాశం జిల్లా మర్రివేముల గ్రామానికి చెందిన సిద్ధి మల్లేశ్వరికి చెందిన ఎద్దులు 2841 అడుగులు లాగి మూడో స్థానం సాధించి రూ.20వేలు గెలుపొందాయి. నంద్యాల జిల్లా బోయలకుంట్ల గ్రామానికి చెందిన ఎస్ఎంఆర్ బుల్స్ గిత్తల మదార్‌వలికి చెందిన ఎద్దులు 2819 అడుగులు లాగి రూ.10వేలు సొంతం చేసుకున్నాయి. నిర్వాహకులు గెలుపొందిన ఎద్దుల యజమానులకు నగదు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జనార్దన్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఉమామహేశ్వరరావు, చిట్టిపు ప్రభాకర్ రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం హర్షణీయం

నంద్యాల(వ్యవసాయం): వక్ఫ్ సవరణ బిల్లుకు ఉభయ సభల్లో ఆమోదం లభించడం హర్షనీయమని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రం విష్ణువర్ధన్‌రెడ్డి, పోలేపల్లి సందీప్ అన్నారు. ఈ బిల్లు ఆమోదానికి విశ్వహిందూ పరిషత్ సైతం కృషి చేసిందన్నారు. పలువురు ఎంపీలను కలిసి మద్దతు కోరినట్లు తెలిపారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో..

మహానంది: మహానందీశ్వర సన్నిధిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన సీనియర్ ఐపీఎస్ జీఎస్ రావు, జిల్లా న్యాయమూర్తి పట్టాభిరామ్ గురువారం పూజలు నిర్వహించారు. కామేశ్వరిదేవి, మహానందీశ్వర స్వామిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. దర్శనం అనంతరం స్థానిక అలంకార మండపంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.